# యామారించేదానికి ఎన్నిదోవలో?

"నేనేం గుడ్డికోడినా ఎల్లకాలం యామారి పాయ్యేదానికి? తలొంచి తాళి కట్టించుకునిందెప్పుడు? అప్పిట్నుంచి సూస్తానే ఉండ్లా! ఈ పొద్దు కొత్తగా ఏమన్నా సూడ బోతానా? ఏ ఊరికన్నా పోనీ. ఇంటికి తిరుక్కోని వొచ్చేటప్పుడు సేతులు ఊగులాడించుకుంటా వొచ్చే మణిసి ఈ పొద్దు అన్ని పూలూ పొండ్లూ శాత బట్టుకోని వొచ్చినాడంటే తెల్సిపోతానే ఉండ్లా. ఇంక పెట్టి చంకకు... కాలు బయిటికి..."

చేతిలో పూలూపొండ్లు పొట్లాలు టేబులు మింద పెట్తి. వాటికల్లా మా బాశాలి చూసీ చూడనట్టుగానే చూసె. నన్ను వొక్కంటితో ఎగాదిగా చూసె. ఒంటికాలిమింద లేసె. సొణుక్కుంటా ఒక్కయిసుర్లో లోపలికి పాయ. ఎంట పడదామంటే ఎదిగొచ్చిన పిలకాయిలు. వాళ్లుగూడా కొత్త పాటయితే యినే దానికి మునాసపడ్తారు. పలకతా ఉండేది పాతకేసెట్టే గదాని వాళ్లుగూడా సట్టుచెయ్‌లా. వాళ్ల పన్లమింద వాళ్లుండారు.

నాకు మాత్రం వొళ్లు సురక్కుమనింది!

అయినా కాళ్ళు కట్టేసినట్టు అట్టా యిట్టా కదల్లేకుండా పోతి. నోటికి వాయిగొ టేసినట్టు నోరిప్పలేక పోతి. దిగేసిన కూసం మాదిర్తో నిలబడ్తి. ఎవుడికైనా కాలూ

చెయ్యి కన్నూ ముక్కు చెప్పినట్టు యింటాయి. అదే మణుసు? అది కట్టిపెట్నా నిలిస్తిందా? దాని దోవ అది చూసుకుండె!

చిన్నప్పుడు నేను మామునెమ్మక్క యింట్లో ఉండిగదా చదువుకుణ్ణింది. ఇప్పటి మాదిర అప్పుడేమన్నా గేస్ పొయ్యిలా పాడా? ఇట్ట తిప్పితే మండి అట్ట తిప్పితే ఆరిపొయ్యేదానికి! పొయ్యి మండాలంటే ఆ కాలాన పేడ ఏరి తెచ్చుకోవాల. పిడకలు తట్టుకోవాల. వాటికితోడు ఎండుపుల్లలో కట్టెలో ఉండి తీరాల!

ఒక దినం మద్దేణంకాడ ఆమె ఎండుపుల్లలు ఏరి తెచ్చుకోవాలని ఎలబార్తా-

''ఒరే అబ్బోడా! అక్కారం పల్లికి ఆవారకు పోతే గదా నాలుగు ఎండుపుల్లలు దొరకబోతాయి. అక్కారంపల్లి ఏం యీడుండాదా ? వొచ్చేకుందికి సీగిటిబడి పోతిందేమో? నువ్వు యిస్కూలినుంచి వొస్తానే ముందుగా బిందిడు కొళాయి నీళ్ల పట్టిపెట్టు. నీళ్ల నిల్చిపోతే ఈ ఉప్పునీళ్ల తాగి సావలేం. మల్లాగావాలంటే అద్దో ఆవాకిట్లో ఎండతా ఉండాయి పిడకలు. అవ్వి దెచ్చి యింట్లో పెట్టు. మొబ్బూ మోడంగా ఉండాది. నాలుగు చినుకులురాల్తే తడ్చిపోతాయి. అబ్బారే మర్చిపోవద్దు.'' అనె.

నేను ఉసారుగా తలకాయి ఆడిస్తి.

తట్టెత్తి చంకనేసుకోని ఆమె దోవన ఆమె పాయ. పుస్తకాలెత్తి శాతపట్టుకోని నాదోవన నేను యిస్కూలికి పోతి.

ఎట్ట మర్చినానో యిస్కూల్లో ఆమాటే మర్చిపోతి. పెద్ద పులవర్ మాదిర పుట్‌బాలాట ఆడుకుండే దానికి పోతి. ఆడుకుణ్ణెంత సేపూ ఆడుకుంటి. ఆ మిందట యింటికి తిరుక్కోని వొస్తి. అప్పటికే కన్జీగిటి పడ్తా పడ్తా ఉండాది. కొళాయి నీళ్ల ఎప్పుడో నిల్చిపాయినాయి. పిడకలు యాడివాడ పడుండాయి. మాయక్క యింకా యింటికిరాలా. 'ఆమె చెప్పిందేంది? మనం చేసిందేంది?' అనుకుండే కుందికి గుండెల్లో రాయి పడె.

''వొచ్చి అడిగితే ఏమని బొదులు చెప్పాల? ఆ పొద్దు దొబ్బులెట్టా తప్పించుకోవాల?'' అంటా మణుసులో యాదన పడిపాయ. కాలుగాలిన పిల్లి మాదిర్తో అట్టాయిట్టా తిరగతా తిరగతా అట్ట చూసేకుందికి ఉత్తరంగా కొండమింద గాలిగోపరం కంటపడె. ఆ సెంకు... ఆ సెక్రం... ఆనామాలు చూస్తావుంటే ఏడుకొండలోడే ఎదురుంగా నిలబడినట్టుండె!

''సామీ! సామీ! నన్ని ఆ పితినుంచి ఎత్తి అట్టా గెడ్డన పారెయ్ సామీ! ఆపద మొక్కుల ఆసామిగదా నువ్వు'' అంటా రొండు చేతులెత్తి మొక్కితి.

అంతే! ఈది తలుపులు బార్లమని తెర్చిపెట్టి. గబగబా యింట్లోకి పోతి. మంచం వాల్చుకుంటి. ఆ మంచం మింద దుప్పటి కప్పుకోని పొణుకుంటి. పొణుకోని యీదికల్లానే చూస్తా ఉండా. అయిదు నిమిశాలైనా అయ్యింది లేదో? మాయక్క గంపనెత్తిన బెట్టుకోని గడపట్ట ఎక్కతా ఉండాది. నేను పల్లవి అందుకుంటి.

''అక్కా!... అమ్మా!... అయ్యో!... అక్కా...''

ఆ మూలుగు మాయక్క చెవల్లో పడినట్టుండాది. నెత్తిమింద గంప యిసిరట్టా పారేసె. ఒక్క ఊపులో మంచం కాడికొచ్చె. నా మింది కొంగె. నా ఎదురొమ్ముమిందచెయ్యేసె.

''ఏమిరా అబ్బోడా? ఏమయిందిరా నాయినా?'' అంటా దుప్పటి తీసేబోతే నేను తియ్యనిస్తానా? కుక్కపిల్ల మాదిర్తో ముడుక్కుంటా మూలిగేది యింకా జాస్తి చేస్తి.

''ఒరే! సెప్పరా నాయినా! నీ బాదేందో సెప్పరా. అయ్యయ్యో! ఉండుండీ ఈ పొద్దనంగానే ఈ పాడుకట్టెపుల్లల కోసరం పోతినే. బిడ్డ ఎంత సేపిట్నుంచి యిట్టా అల్లాడ్తా ఉండాడో ఏం పాడ్నో? ఇక్కన పక్కన ఉండేవాళ్లు పట్టించుకుండే కాలం గాకపాయ. ఏం జేతురా దేవుడో?'' అని వగస్తానే-

''సెప్పారా అబ్బోడా! సెప్పరా! ఏమయిందో సెప్పరా!'' అని గుచ్చి గుచ్చి అడిగె.

అడుక్కుండే కుందికీ ముడక్కుండేది జాస్తిగదా? అందులో కావాలనే ముడుక్కుణ్ణోణ్ణి. నేనుగూడా రొంచెపు ఉడకాడిపిస్తి. ఆ మిందట-

''అక్కా!... అమ్మా!... అయ్యో!... అక్కా!...'' అని మూలగతానే రొండుశాతల్తో తలకాయి గెట్టిగా అదిమి పట్టుకుణ్ణా.

''అయ్యయ్యో! పాడు తలకాయినొప్పి. బిడ్డను మూడు మూన్నాళ్లకు ఎతుక్కుంటా వస్తావుండాదే? దీని తాడుదెగ. ఈ లోకంలో యింకెవుడూ లేనట్టు యీడికే వొస్తిందే? దీని దూము దగల!'' అని తలకాయినెప్పిని తిట్టిపోస్తా ఆదరాబాదరా అంత సొంటి సాదె. తలకు పట్టేసె. అంత కాపీ పెట్టిచ్చె. అప్పిటికి నేను మూలుగుడు సౌండ్ కొంచిం తగ్గించినా.

ఆమె మణుసు కొంచిం నిమ్మతిపడె. అప్పుడామె పక్కింటికో ఎదిరింటికో పాయ. ఏమి తిప్పలు పడిందో ఏం పాడో? తాగేదానికి తబిలనీళ్లు తెచ్చుకుండె. పిడకలెత్తి ఒక మూల పేర్సి పెట్టె. ఏరుకోని తెచ్చిన ఎండుపుల్లల్ను అటిక మింది కెక్కించె.

అప్పుడు నేను యీది నాటకంలో దుర్యోదనుడి మాదిర్తో 'హ్హాహ్హాహ్హా!' అని నవ్వతా పైకి లేచినా. ఇంకెందుకు పొణుకోవాల? నాడూటీ అయ్ పాయగదా?

ఇంక చూస్కో నాసామిరంగా-

''ఒరే దొంగయదవా? ఎద్దుకాల్లో ముల్లంత లేవు. నాకే టోకరా యిస్తావంట్రా? నన్నే యామారిస్తావా?'' అంటా ఆమె నాపైకి లేచె. నే నెటుమంటోణ్ణి? ఆమె జాట్లో దూరిపొయ్యేటోణ్ణి. చేతికి దొరకతానా?

అప్పుడెప్పుడో చిన్నప్పుడు చెప్పినపని చెయ్‌కుండా దొబ్బులు తప్పించుకుండే దానికి మాయక్కను నిజంగా యామార్సినా. ఇప్పుడట్టా కుదిర్తిందా? పోనీ! ఆ మాదిర అయ్యుంటే ఈ సంసారం ఏమయి పొయ్యుండాల? అర్తం పర్తం రొండూ లేకుండా నోరు పారేసు కుంటారే ఈ ఆడోళ్లు?

మణుసు దానిపాటికది కుమల్తా ఉండాది.

''అది ఎవుర్నైనా బాగా నమ్మబలుక్కోవాల. బాగా నమ్మకం కుదిరినాక మేకపోతును మేపి మేపి గొంతుమింద కత్తి పెట్టినట్టు అప్పుడు యామార్సాల!''

''అయ్యో! నమ్ముకుంటినే?'' అంటే–

''నమ్ముకుణ్ణోణ్ణి గాకుండా యింకెవుర్ని యామార్సాల?'' అని తిరుక్కోని అడగాల.

అటుమంటి వాళ్లదే కాలం. యాడజూడు అటుమంటి వాళ్లే చలామణి అయిపోతా ఉండారు. అని నా ఆలోచనా నాదిగా ఉంటే–

''అది సరేగానీ ... అడగండమ్మా అడగండి. యాడేడ తిరగాల్నో? ఏమేమి సెయ్యాల్నో? పొయ్యేసోట దినాలే అవితిందో? వారాలే పట్టితిందో? అడగండమ్మా! అడగండి. ఆ పెట్లో ఏమేమి పెట్టాల్నో?''

''చచ! యిందుకేనేమో ఆడబుద్ధి అసరబుద్ధి అంటారు. లేకుండాబోతే ఆమె కూసే కూతల్లో అర్థం పర్థం ఉండాదా? నన్ను నమ్ముకుంటే నేను నమ్మించి నమ్మించి యామార్సతా ఉండానా? పోనీ రొండు పూలో పాండ్లో తెచ్చేకుందికి ఆపె యామారిపోతా ఉండాదా? ఎంత నంగనాచి టంగుబుర్రబ్బా? అయినా యిట్టా మాదిరి యామారించి నేనేం చేస్తా ఉండా? పెట్టి చంకలో పెట్టుకోని ఊళ్ల మింద పడ్తా ఉండా. నిజిమే! ఎందుకు పడ్తా ఉండా? ఆడుకునే దానికా? అడుక్కతినే దానికా? ఆ మాత్రం యింగితగ్నానం లేకుండా పొయ్యింటే ఈ కొంప మూడారు దోవలేగదా? రచ్చగెల్సి ఏం ప్రయోజనం? ఈ కొంపకంటే కోనేటికట్ట మేలుగదా?''

''ఏమే ఏమే? యామారి పొయ్యేటి వయ్యారిబామా! పెట్టెత్తి చంకలో పెట్టుకుండే దానిగ్గాదే నేనీ పూలుపాండ్లు తెచ్చింది. బజార్లో వస్తా ఉండా. వాడుండ్లా రామ్మూర్తి. ఎచ్చులమారోడని నువ్వు ఎగతాళి చేస్తావుండ్లా వాడు. మల్లిపూలు కొంటా ఉండె. కొంచిం నంచిం గాదు. ఒక తట్టడు పూలు!''

''ఈ యాపారం ఎప్పుడు పెట్నావురా?'' అని అడిగితి.

వాడు కిండల్‌గా చూస్తా–

''యాపారం పెట్టుకుంటే కూసోని అమ్ముకుంటాడు గానీ నిలబడి కొనుక్కోడే?'' అంటా ముసి ముసిగా నవ్వె.

''అయితే ఎందుకురా ఒక తట్టడు పూలు?''

''అట్టా అడుగు చెప్తా. ఈ పొద్దు నేనిస్తా ఉండా. ఒకే ఒక దోసిడు పూలు. ఎత్తుకోని పో. ఒకనాటికి నువ్వుగూడా తట్టడుపూలు కొనకుండా బోతే నా చెప్పు నేనే కోసుకుంటా.''

వాడేం చెప్తా ఉండాడో అర్థంగాకుండా తేలకండ్లు పడె!

F 6653



వాడు గెమనించె.

''ఓహోహో! వొట్టి పూలే అని అనుమానం పడ్తా ఉండావా? కూడా రొండు పొండ్లుకూడా తీసిస్తా ఉండు.'' అంటా వాడు అన్నెంత పని చేసె. వస్తా నంటే యిస్తానంటే వద్దనే వాడు ఎవుడుంటాడు? అవ్వి తీసి శాత బట్టుకోని యింటికొస్తి. వాడు చెప్పినట్టు తట్టడుపూలు కొంటానో లేదో గానీ నువ్వడగతా ఉండావే మాట్లు? వాట్ని మాత్రం తట్టల్లో ఎత్తాల్సిందే గదా?'' అని చెప్తామని నోటిదాకా వచ్చె. చెప్పాలను కుణ్ణింది అంతా చెప్పేస్తే మనం మొగోళ్లు ఎట్టవతాం? వాళ్ల పెండ్లాలెట్టవతారు? అందుకే చెప్పకుండా బయటపణ్ణా!

నాలుగ్గాళ్లమండపాన్ని దాటుకోని పోబోతా ఉండా.

వెంకటరెడ్డి ఎదురు పడె!

''ఏమిరా? మొన్న వచ్చినప్పుడు చూస్తే చెరుకు గానిగాడుకుంటా ఊపిరి తిరక్కుండా ఉంటివి. ఆ అల్లాటం పొల్లాటం చూస్తా ఉంటే నాకే అయ్యోమనిపించె. పోనీ... ఇప్పటికన్నా తీరుబాటు అయినట్టేనా?'' అని అడిగితే-

వాడు పెద్ద యాదాంతి మాదిర్తో నవ్వతా-

''తీరుబాటా? అయ్యో రామ! రైతనే వాడికి తీరుబాటా? అంతా తీరుమానం చేసుకోని వొగిటే పారిగా ఎలబారి పోతాడే అప్పుడు గదన్నా వాడికి తీరుబాటు! ఎట్టా గుక్క తిప్పుకో లేకుండా ఎలబారొస్తా ఉండా!''

''అంత గొంతల మింది కేమొచ్చిందిరా?''

''వాడుండ్లా?... మెత్తని పలగాకి రెడ్డోరి రగునాదుడు. సొసైటీ ప్రసిడెంటుగా పోటీలేకుండా గెలిపిస్తే వాడి ఆట వాడిదిగా ఉండాదే?''

''తలకు మించిన ఆటాడ్తే వాడే అనుబోగిస్తాడు. మద్దె నీకెందుకురా?''

''అట్లనుకోనే యిడ్సిపెట్తే వాడు యీడికాడికి గాకుండా నా గొంతు కాడికే తెచ్చిపెట్టె. ఏమి సొసైటీయో? ఏం పాడో? ఎవుడికేం తెల్సు? యాడ దుడ్లు తెస్తా ఉండారో? ఎట్టెట్ట తెస్తా ఉండారో? ఎవురికిస్తా ఉండారో? ఆ దేముడికే ఎరిక! వాడి గడప తొక్కలా. వాడి మొకం సూళ్లా. వాడి ముందు సెయ్యాసాపలా? అట్లుంటే నేనే బాకీ పణ్ణెట్టు రాసిపెట్టేసినాడు. ఇప్పుడా సొసైటీ వాళ్లొచ్చిరి. కట్తావా కక్కతావా? అని గొంతల మింద కూసుండ్రి. నోరుతెరిస్తే జప్తీ అంటారు. వాడి ఎళువు ఎట్టా ఏడ్సేది? తలపగల గొట్టుకుణ్ణా తట్లా? ఏమి చెయ్యమంటావో చెప్పు?''

నాలుగ్గాళ్లమండపం సాచ్చిగా వాడి మొకంలో నెత్తురు చుక్కలేదు!

''ఏం పరవాలేదురా? రైతులకింకేం పరవాలేదులేరా!''

''అవునవును! ఏం పరవాలేదు. రైతుల కింకేం పరవాలేదు. నిన్నగాక మొన్న. మన ముక్కెమంత్రి. రొండెడ్లల బండిమింది కెక్కెనా? సిర్తలు శాతపట్టెనా? చెక్కబజిన చేసెనా?

ఇంకేంగావాల? ఇంక రైతులు కోరిన కొండ మింద వానకుర్సేది ఖాయం!''

''ఎవురబ్బా యాసణ్ణం పడ్తా ఉండారే?'' అని తిరిగి చూస్తే ముత్తన్న.

''అదిగాదన్నా! రైతుల కోసరం కర్షక పరిషత్ పెట్నారు గదన్నా''

''ఆ! ఆ! పెట్నార్రా అబ్బోడా పెట్నారు. పెట్టిందే గాకుండా మేడిపిడే పట్టలేనోణ్ణి మేటి రైతును చేసిరి. వాడే రైతు నాయకుడు. అది గాదురా అబ్బోడా! నాకు తెలవకుండా అడగతా ఉండా. వానల్లే! వంగుడూలే! పచ్చని చీరలు ఆరేసినట్టు చూపు ఆన్నెంత దూరం కంటికి పచ్చంగా కనిపించిన బూములు పాడుగొట్టుకుంటా ఉండాయి. రైతులు యింకా పల్లెల్లో బతకలేకుండా ఆడనుంచి కాలు ఎలబెరుక్కోని రాలేకుండా కటకటకలాడి పోతా వుండారు. ఇప్పుడెందుకురా ఈ పరిషత్తులు?''

''అదేందన్నా అట్టంటావే? పరిస్తితులు బాగలేనప్పుడే గదా పరిషత్తులు కావాల్సింది. నాలుగు పెద్ద తలకాయిలు ఒక చోట చేరుకోవాల. ఇప్పుడేం చెయ్యాల? ఎట్ట చెయ్యాల? అని ఆలోచించాల. ఏదో ఒగిటి చెయ్యాలనే గదన్నా ఈ పరిషత్తులు పెట్టింది.''

''అవునురా అబ్బోడా అవును. చించాలనేరా ఈ పరిషత్తులు పెట్టింది. లేక పోతే ఏందిరా యీ కసరత్తులు? ఇది ఎట్టుండాదంటే దప్పికితో అక్కి ఎండకపాయ్ చస్తావుంటే బాయి తొవ్వేదానికి లగ్గణం పెట్టమని అయ్యోరి దగ్గిరికి ఎలబారి నట్టుండాది. లగ్గణం కుదరాల్నా? బాయితొవ్వాల్నా? తొవ్విన బాయిలో నీళ్ల పడాల్నా? ఏడ్సే బిడ్డకు ఎలక్కాయి చూపించే యవ్వారం! యామారించే దానికి ఎన్ని దోవలో పదరా!'' అనె.

''ముందు బాగా నమ్మ బలుక్కోవాల. మల్లాగావాలంటే యామార్సాల!''

గడప దాటదు మా బాశాలి. అయినా చెప్పిన మాట కోటల్ను దాట్నే! నాకంటే అదే మేలుగా ఉండాది.

''అన్నా! నువ్వెవురో నాకు తెల్దు. అయినా నువ్వు సెప్పినావే? ఒక్కొక్క మాట ఒకొక్క వరహా చేస్తింది. నా ఆయుస్సుగూడా పోసుకోని నూరేండ్లు బతుకన్నా!'' అంటా ఉండాడు వెంకట రెడ్డి ముత్తారెడ్డన్నను చూస్తా! ●